# ఖర్గే ఊరిలో నీళ్లకే దిక్కులేదు

- కర్ణాటకలో రోడ్లు లేవు.. కరెంటు లేదు
- తెలంగాణకు వచ్చి నీతులు చెప్పడా?
- బీఆర్ఎస్ పాలన చూసి నేర్చుకొని వెళ్లాలి
- తెలంగాణను కాంగ్రెస్ బిచ్చం వేసిందట
- కాంగ్రెస్ చీఫ్ వ్యాఖ్యలపై హరీశ్ ఫైర్
- 5 గ్యారెంటీలతో కర్ణాటక ఖజానా నిల్
- విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లూ ఇవ్వట్లేదు
- రైతుబంధుపై కాంగ్రెస్ దొంగ హామీలు
- ఎకరా చొప్పున కాదు.. రైతుకు 15 వేలే
- నారాయణఖేడ్, ఎల్లారెడ్డి రోడ్‌షోల్లో వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్



శుక్రవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు రోడ్‌షోకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు



సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: తెలంగాణకు వచ్చి నీతులు చెప్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జునఖర్గే సొంత ఊరిలోనే మంచినీళ్లకు దిక్కు లేదని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. కర్ణాటకకు చెందిన ఖర్గే సొంత ఊరిలో కరెంటు కూడా లేదని చెప్పారు. ఇక్కడికి వచ్చి నీతులు చెప్పేకంటే, బీఆర్ఎస్ పాలన చూసి నేర్చుకొని పోవాలని చురక అంటించారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పెట్టిన భిక్ష అని ఖర్గే మాట్లాడు తున్నారని మండిపడ్డారు. తెలంగాణను అవ మానించేలా మాట్లాడితే ఖబర్దార్ అని హెచ్చ రించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా నారాయ ణఖేడ్‌లో, కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని గాంధారి, ఎల్లారెడ్డిలో రోడ్‌షోల్లో, రేడియో మిర్చి(ఎఫ్ఎం) ఇంటర్వ్యూలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ఐదు గ్యారంటీలతో కర్ణాటక ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యిందని తెలిపారు. విద్యార్థు లకు స్కాలర్‌షిప్‌లు కూడా ఇచ్చే పరిస్థితి లేదని, అలాంటి పరిస్థితి మన రాష్ట్రంలో తెచ్చు కుందామా? అని ప్రజలను అడిగారు. మాట మీద నిల్చోని కాంగ్రెస్‌ను నమ్మి రిస్క్‌లో పడ దామా? లేక ప్రజలకు మంచి పాలన అంది స్తున్న తెలంగాణ గాంధీ కేసీఆర్‌ను గెలిపించు కుందామా? అని అన్నారు. కర్ణాటకలో మూడు గంటల కరెంటే ఇస్తున్నారని, దీంతో అక్కడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆ రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ 5 గ్యారెంటీ లపై ఊదరగొట్టారని, వారిని నమ్మి అక్కడి రైతులు నిండా మోసపోయారని తెలిపారు. మూడు గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్ల కాంగ్రెస్‌ను నమ్మి మోసపోదామా? 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న కేసీఆర్ పాల నను కాదని రిస్క్ తీసుకుందామా? అని ప్రశ్నించారు. టీడీపీ, కాంగ్రెస్ పాలనలో వ్యవ సాయం దండుగ అన్నారని, కానీ.. కేసీఆర్ వచ్చాక వ్యవసాయం పండుగ అయ్యిందని అన్నారు. తెలంగాణ రైతులు పది రాష్ట్రాలకు అన్నదాతలుగా మారారని వెల్లడించారు.

> కట్క వేస్తే వచ్చే కరెంట్ కావాలా? కటిక చీకటి కర్ణాటక లాంటి బతుకు కావాలా? ప్రజలే తేల్చాలి.
>
> - మంత్రి హరీశ్‌రావు

### కేసీఆర్ అంటే నమ్మకం, విశ్వాసం

ఓటు వేసేముందు ఆలోచించి వేయాలని, నమ్మకానికి మారుపేరైన కేసీఆర్‌ను మరో సారి దీవించాలని ప్రజలను హరీశ్ కోరారు. ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని, కాయితీ లంబాడీల సమస్యను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 'బీ ఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఎకరాకు రూ.16 వేలు రైతుబంధు ఇస్తామని సీఎం కేసీఆర్ చెప్తుండు. మరి కాంగ్రెసోళ్లేమో రైతుకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తమంటు న్నరు. కాంగ్రెసోళ్ల కాయిదం జర జాగ్రత్తగా చదువుర్రి' అని సూచించారు. కార్యక్రమాల్లో ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జాజాల సురేందర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనే యులు, మాజీ ఎమ్మెల్యేలు జనార్దన్‌గౌడ్, విజయపాల్‌రెడ్డి, వేలమంది ప్రజలు పాల్గొ న్నారు. కాగా, హరీశ్‌రావు రోడ్‌షోలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. రోడ్‌షోలన్నీ ప్రజలతో కిక్కిరిసిపోయాయి. దీనిని చూసిన మంత్రి.. ఇదే ఉత్సాహాన్ని 30వ తేదీ వరకు కొనసాగిం చాలని అన్నారు.

> గతంలో వ్యవసాయం చేసేవారికి పిల్లనిచ్చే వారు కాదు. ప్రస్తుతం కేసీఆర్ పాలనలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కరెంట్ కష్టాలు పోయాయి. చెరువులు బాగు చేసుకున్నాం. చెక్ డ్యాంలు నిర్మించుకున్నాం. పెట్టుబడి సాయం, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుతున్నాయి. రైతులకు అవసరమైన ప్రతి సదుపాయాన్ని కల్పించాం.
>
> - మంత్రి హరీశ్‌రావు

### నంగునూరులో గులాబీ'వాన'

ఓవైపు చిరుజల్లులు.. మరోవైపు శీతల గాలులు ఉన్నా లెక్కచేయకుండా మంత్రి హరీ శ్‌రావు రోడ్‌షోకు ప్రజలు పోటెత్తారు. శుక్ర వారం రాత్రి సిద్దిపేట జిల్లా నంగునూరులో హరీశ్‌రావు రోడ్‌షో నిర్వహించారు. దీనికి ప్రజలు భారీగా తరలివచ్చారు. వర్షం పడు తున్నా రోడ్లపై నిల్చొని, డాబాల పైకెక్కి హరీశ్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. నంగునూరు అంటేనే తనకు ఎంతో నమ్మకం, భరోసా అని అన్నారు. సీఎం కేసీఆర్‌కు సైతం నంగునూరు మండల కోనాయిపల్లి వేంకటేశ్వరాలయం సెంటిమెంట్ అని తెలిపారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ దొంగరాత్రి కరెంట్ వస్తుందని, రిస్క్ వద్దని, మళ్లీ కారుకే ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్య క్షుడు లింగంగౌడ్, రాష్ట్ర ఆయిల్‌పామ్ వెల్ఫేర్ సొసైటీ వైస్ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లోకి పటాన్‌చెరు కాంగ్రెస్ అభ్యర్థి అన్నావదిన

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు కాంగ్రెస్ అభ్యర్థి కాట శ్రీనివాస్‌గౌడ్‌కు పెద్దషాక్ తగి లింది. శుక్రవారం హైదరాబాద్‌లో హరీశ్‌రావు సమక్షంలో ఆయన అన్నావదిన కాట రాజేశ్ గౌడ్, కాట సునీత బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. అనంతరం దంపతులు మీడియాతో మాట్లాడుతూ.. సొంత అన్నావది నను మోసం చేసిన వ్యక్తి ప్రజలకు ఏం మేలు చేస్తాడని కాట శ్రీనివాస్‌గౌడ్‌పై మండిపడ్డారు. తమకు రావాల్సిన ఆస్తులను అమ్ముకుంటూ మోసం చేశాడని ఆరోపించారు.



శుక్రవారం హైదరాబాద్‌లో ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాట రాజేశ్‌గౌడ్, కాట సునీత దంపతులు

### ఓటు.. ఐదేండ్ల భవిష్యత్తు

ఐదేండ్ల రాష్ట్ర భవిష్యత్తు యువత చేతిలో ఉన్నదని, ఆలోచించి ఓటెయ్యా లని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సూచిం చారు. సోషల్ మీడియాలో రీల్స్, ఎమో షనల్ వీడియోలకు ఆకర్షితులై ఓటేస్తే, భవిష్యత్తు పెనుప్రమాదంలో పడుతుం దని హెచ్చరించారు. శుక్రవారం రేడియో మిర్చి(ఎఫ్ఎం) ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. ఈ సారి మొదటిసారి ఓటువేసేవారు విజ్ఞతతో ఆలోచించి వేయాలని అన్నారు. బూతు రాజకీ యాలు కావాలో, భవిష్యత్తు రాజకీ యాలు కావాలో ఆలోచించుకోవాలని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో నిజాలు తక్కువయ్యాయని, అబద్ధాలు ఎక్కువయ్యాయని తెలిపారు. ప్రస్తుతం కొందరు యువతను ఆకట్టుకోవచ్చనే ఆలోచనతో తప్పుడు సమాచారాన్ని యువత మెదళ్లలో నాటాలని చూస్తున్నా రని, తప్పుడు సమాచారానికి ఆకర్షి తులు కావొద్దని సూచించారు. నిజమే మిటో? అబద్ధమేమిటో? తెలియా లంటే.. ఇతర రాష్ట్రాలతో తెలంగాణను పోల్చి చూడాలని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని వివరించారు. పల్లెల నుంచి పట్టణాల వరకు రాష్ట్రమంతా అద్భుతంగా అభి వృద్ధి చెందిందని చెప్పారు. హైదరాబాద్ మార్పు అందరికీ ఆశ్చర్యం కలిగిస్తున్న దని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎంతోమంది నగరాన్ని మెచ్చు కుంటున్నారని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ యాడ్ కూడా ఫేకే!

- తెలంగాణలో తప్పుడు ఫొటోతో కర్ణాటక కాంగ్రెస్ ప్రచార యాడ్
- ఓ వెబ్‌సైట్ నుంచి విద్యార్థి ఫొటో తీసుకొని లబ్ధిదారుడిగా ప్రచారం
- తెలంగాణ ఎన్నికల్లో గెలిచేందుకు కర్ణాటక ప్రజాధనం వృథా
- ఇప్పటికే సర్వేల పేరుతో ఫేకుడు
- అడ్డంగా దొరికి సోషల్ మీడియాలో ఇజ్జత్ పోగొట్టుకున్న హస్తం పార్టీ

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతున్నది. ఇప్పటికే ఫేక్ సర్వేలతో మైండ్‌గేమ్ ఆడుతున్న పార్టీ ఫేక్ రాజకీయంలో మరో ముందడుగు వేసింది. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్న ట్టుగా.. అబద్ధాలు, అభూత కల్పనలతో మా యామశ్చీంద్ర విద్యలను ప్రదర్శిస్తున్నది. ఓట్ల వేటలో విన్యాసాలు చేయబోయి పప్పులో కాలేసింది. లేనివి ఉన్నట్టుగా ప్రచారం చేసు కొనే ప్రయత్నంలో అడ్డంగా దొరికిపోయి అభాసుపాలయ్యింది. 'ఆరు నెలల అద్భుత సాధన' పేరుతో కర్ణాటక కాంగ్రెస్ సర్కారు తెలంగాణలోని తెలుగు పత్రికలకు శుక్రవారం భారీ ప్రకటనలు ఇచ్చింది. తాము 6 గ్యారెం టీలను నెరవేర్చామని చెప్పడం ఈ యాడ్ థీమ్. ఈ ప్రకటనలో ఓ విద్యార్థి ఫొటోను వాడారు. ఆ విద్యార్థి యువనిధి కింద తనకు నెలకు రూ.3వేలు అందుతున్నదని చెప్పిన ట్టుగా ప్రకటన జారీచేశారు. వాస్తవానికి ఆ విద్యార్థి ఫొటో ఒక వెబ్‌సైట్‌కు చెందినదిగా తేలింది. కర్ణాటక ప్రభుత్వ ప్రకటనలో పేర్కొన్న యువకుడి చిత్రాన్ని పరిశీలిస్తే ఇది ప్రాక్టీస్ విత్ ఈవ్ (PRACTICE WITH EVE) వెబ్‌సైట్ నుంచి తీసుకున్నట్టు గుట్టు రట్టయ్యింది. మేనేజ్‌మెంట్ విద్యార్థులకు కేస్ సాల్వింగ్ సామర్థ్యాన్ని పెంచే ఆన్‌లైన్ వేదిక ఇది. భవిష్యత్తులో ఇంటర్వ్యూలను ఎదుర్కో వడంలో సహాయపడుతుంది. వారానికి రెం డు కేసులు ఇచ్చి విద్యార్థులతో ప్రాక్టీస్ చేయి స్తారు. ఇలాంటి పోర్టల్ నుంచి ఊరు, పేరు లేని ఫొటోను తీసుకుని ఆ విద్యార్థికి సీకే మహేశ్ అని కాంగ్రెస్ పేరు తగిలించింది. గ్రాడ్యుయేట్ విద్యార్థిగా పేర్కొని తప్పుడు ప్రచారానికి తెరలేపింది. ఈ విషయం తెలు సుకొన్న నెటిజన్లు సోషల్‌మీడియాలో పోస్ట్ చేసి కాంగ్రెస్ పార్టీని ఓ ఆట ఆడుకున్నారు. ఓట్ల కోసం ఇంత ఫేక్ ప్రచారం చేస్తారా? అని హస్తం పార్టీ ఇజ్జత్ తీసి ఆన్‌లైన్‌లో పెట్టారు.

### తెలంగాణలో ప్రచారానికి కర్ణాటక ధనం!

తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఫేక్ ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ కర్ణాటక ప్రజల సొమ్మును వాడటం గమనార్హం. కర్ణాటక ప్రభుత్వానికి, తెలంగాణ ఎన్నికలకు అసలు ఎలాంటి సంబంధం లేదు. కానీ అక్కడి కాంగ్రెస్.. అక్కడి ప్రజల సమస్యలను పరిష్క రించేందుకు.. వారి కన్నీళ్లను తుడిచేందుకు ఖ ర్చు చేయాల్సిన ప్రజాధనాన్ని తెలంగాణ ఎ న్నికల్లో ప్రచారానికి వాడుతున్నది. ప్రస్తుతం కన్నడనాట తీవ్ర విద్యుత్తు సంక్షోభం నెలకొ న్నది. తాము నెరవేర్చుతామని చెప్పిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ పూర్తిగా అమలు చేయడం లేదు. కానీ కర్ణాటక ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బును తెలంగాణలో పార్టీ ప్రచారానికి విచ్చలవిడిగా వినియోగిస్తు న్నారు. దీనిపై అటు కర్ణాటకవాసులతోపాటు ఇటు తెలంగాణ ప్రజలు కూడా మండిపడు తున్నారు. ఇప్పుడు తెలంగాణ ఎన్నికల్లో గెలి చేందుకు కర్ణాటక ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ.. రేపు ఇక్కడ గెలిస్తే దేశ వ్యాప్తంగా ఎన్నికల్లో ప్రచారానికి మన సంప దను దోచుకెళ్లదా? అని ప్రశ్నిస్తున్నారు. ఫేక్ కాంగ్రెస్‌ను నమ్మేది లేదని తేల్చిచెప్తున్నారు.

## హైదరాబాద్ 'రియల్'పై కర్ణాటక కొరడా

- ఎస్ఎఫ్‌టీకి వంద ఇవ్వాలని కాంగ్రెస్ నేతల ఫోన్లు
- సోషల్ మీడియాలో వైరల్

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో నోట్ల కట్టలను నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ.. కర్ణాటక తర హాలో రియల్ ఎస్టేట్ సంస్థలపై పడింది. ఎన్ని కల నేపథ్యంలో డబ్బులు ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేతలు కొందరు సంస్థల ప్రతినిధు లకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతు న్నట్టు ఉన్న ఒక పోస్టు శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బెంగళూరులోని బిల్డర్లు, రియల్ సంస్థల ప్రతి నిధుల నుంచి చదరపు అడుగుకు రూ.500 చొప్పున గైడ్ వాల్యూ ట్యాక్స్ రూపంలో ముక్కు పిండి వసూలు చేశారు. ఇలా కోట్లాది రూపాయలు వసూలు చేసిన విషయం కొన్ని రోజుల కిందట సంచలనం కలిగించింది. ఇదే తరుణంలో బెంగళూరులో జరిగిన ఐటీ దాడుల్లో ఓ కార్పొరేటర్ ఇంట్లో ఏకంగా రూ.42 కోట్లు లభించాయి. తెలంగాణ ఎన్ని కల కోసమే కాంగ్రెస్ పార్టీ భారీ మొత్తాన్ని సమీకరించిందని కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం సీఎన్ అశ్వత్ నారాయణ బహిరం గంగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోనూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇదే తరహాలో అన ధికారికంగా గైడ్ వాల్యూ టాక్స్‌ను వసూలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

# ధరణి రద్దుతో సాగు ధ్వంసం

## రైతుబంధుకు రాంరాం.. ధాన్యం కొనుగోలు బంద్ • సకాలంలో ఎరువులు, విత్తనాలు చేతికందయ్

**కాంగ్రెస్‌కు ఓటేస్తే అన్నదాత బతుకు ధ్వంసం**

- మళ్లీ గెట్టుకాడ పంచాయితీలు మొదలైతయ్
- మళ్లీ పాత కాలం.. భూరికార్డులు అస్తవ్యస్తం
- కేసీఆర్ వ్యవసాయ సంస్కరణలు నీళ్ల పాలే
- ధరణిని తీసేస్తే అన్నదాతకు మిగిలేది కన్నీళ్లే
- అందదు సాయం.. వ్యవసాయం ఆగమాగం

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొను గోళ్లు సజావుగా సాగుతున్నాయి. రైతులు పండించిన ప్రతి గింజనూ తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. వారం రోజుల్లో ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. ఒకవేళ కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చి ధరణిని రద్దు చేస్తే.. ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూతపడతాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. మళ్లీ గతంలో మాదిరిగానే రైతులు ధాన్యాన్ని, ఇతర పంట లను అమ్ముకొనేందుకు వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. దళారుల దయాదాక్షిణ్యాలపైనే రైతు బతుకు ఆధార పడి ఉంటుంది. మద్దతు ధర దొరకదు. వ్యాపారులు చెప్పిందే ధర. ఇచ్చినవే పైసలు. ధరణిని రద్దు చేస్తే పంటల కొనుగోళ్లకు ఇబ్బంది ఎందుకొస్తుందనే సందేహం రావొచ్చు. వ్యవసాయ, భూ సంస్కరణల్లో భాగంగా రాష్ట్రంలోని ప్రతి భూమి, రైతు వివ రాలను ధరణిలో నిక్షిప్తం చేశారు. ఏ రైతు, ఎంత విస్తీర్ణంలో, ఏ పంటలు వేశారనే అంశాన్ని వ్యవసాయ శాఖ సర్వే చేసి ఆ వివ రాలను ధరణితో లింకు చేసింది. రైతుల బ్యాంకు అకౌంట్ వివరాలను కూడా దీనికి అనుసంధానం చేసింది. ఈ వివరాల ఆధా రంగానే ధాన్యం కొనుగోలు పోర్టల్‌ను సిద్ధం చేశారు. దీని ప్రకారం ఎంత ధాన్యం వస్తుంది? కొనుగోలుకు ఎన్ని నిధులు అవస రమవుతాయి? వంటి లెక్కలు వేసుకొని కొనుగోళ్లకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటు న్నది. ఈ నేపథ్యంలో ఒక్క ధరణిని రద్దు చేస్తే భూముల వివరాలు ఉండవు. రైతుల వివరాలు ఉండవు. పంటల వివరాలు ఉండవు. వివరాలే లేనప్పుడు ప్రభుత్వం ఏవిధంగా పంటలను కొనుగోలు చేస్తుంది? రైతులకు ఏవిధంగా డబ్బులు చెల్లిస్తుంది? అందుకే ఒక్క ధరణిని రద్దు చేస్తే రాష్ట్రవ్యా ప్తంగా పంటల కొనుగోలు మొత్తం బంద్ అయితది. అదే జరిగితే అన్నదాత మళ్లీ రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

### ధరణి లేకుంటే రైతు'బంద్'!

రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతుబంధు రావొద్దని ఏ రైతు అయినా కోరు కుంటారా? కానీ కాంగ్రెస్ కోరుకుంటున్నది. రైతులకు రైతుబంధు రాకుండా కుట్రలు చేస్తు న్నది. పెట్టుబడి సాయం పంపిణీ మూలాల పైనే దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్నది. అందుకే ధరణిని రద్దు చేయాలని చూస్తున్నది. కాంగ్రెస్ చెప్పినట్టుగా ధరణిని రద్దు చేస్తే.. ఆ మరుక్ష ణమే రైతుబంధు బంద్ అవుతుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఇందుకు కారణం రైతుబంధు పంపిణీ కోసం రైతుల వివరాలను వ్యవసాయ శాఖ ధరణి నుంచే తీసుకుంటు న్నది. రైతుబంధు పంపిణీకి నెల ముందు వరకు ధరణిలో నిక్షిప్తమైన భూముల క్రయ, విక్రయాల ఆధారంగా రైతుల సంఖ్య, భూమి సంఖ్యను లెక్కిస్తున్నది. దాని ప్రకారమే రైతు బంధుకు ఎన్ని నిధులు కావాలో అంచనాకు వస్తున్నది. ప్రతి సీజన్‌లో సుమారు 65 లక్షల మంది రైతులు, 1.56 కోట్ల ఎకరాల భూము లకు రూ.7,500 కోట్ల వరకు రైతుబంధు పంపిణీ చేస్తున్నది. ఇంత భారీ సంఖ్యలో రైతు లకు, భారీ మొత్తాన్ని ఏ అవకతవకలు లేకుండా చేయడం ధరణితోనే సాధ్యమైంది. మరి ధరణిని రద్దు చేస్తే రైతుల వివరాలను, భూముల వివరాలను ఎక్కడి నుంచి తీసుకుం టారు?. ఈ వివరాలేవీ ఉండవు కాబట్టి రైతు బంధు ఇవ్వలేం అంటూ కాంగ్రెస్ చేతులెత్తే స్తుంది. రైతుబంధుతోపాటు రైతుబీమాకు చర మగీతం పాడుతుంది. రైతుల వివరాలే లేన ప్పుడు రైతుబీమా అమలు ఏవిధంగా సాధ్య మవుతుంది? ఒకవేళ సాధ్యమైనా సవాలక్ష కొర్రీలతో దాన్ని పొందడం గగనమవుతుంది. డెత్ సర్టిఫికెట్ల కోసం అధికారుల చుట్టూ తిర గాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

### ఎరువులు, విత్తనాలకోసం లాఠీదెబ్బలు

ఒకప్పుడు ఎరువులు, విత్తనాలకోసం ఎలాంటి ఇబ్బంది ఉండేదో ప్రతి రైతుకూ అను భవమే. ఎర్రటి ఎండల్లో పోలీస్‌స్టేషన్ల ముందు చెప్పులు క్యూలైన్లలో పెట్టి రోజుల తరబడి వేచి చూసిన సందర్భాలు కోకొల్లలు. ఒక్క ఎరువుల లారీ లోడ్ వస్తే.. ఒక్క బస్తా దక్కించుకునేందు కు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఒక్క బస్తా దక్కాలంటే.. పోలీసుల లాఠీ దెబ్బలు తినా ల్సిందే. కానీ ఇప్పుడు పోలీస్‌స్టేషన్ల ముందు క్యూలైన్లు లేవు. రైతులపై పోలీసుల లాఠీలు విర గడం లేదు. ఇందుకు కార ణం ధరణి. ధరణి పోర్టల్‌లో రైతుల వివరాలు, భూ విస్తీర్ణం వివ రాలతోపాటు పంట విస్తీర్ణం వివరాలను కూడా అధికారులు పొందుపరుస్తారు. ఏ జిల్లాలో, ఏ పంట, ఎంత విస్తీర్ణంలో వేశారో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తారు. ఆ లెక్క ప్రకారం ఎంత మొత్తంలో ఎరువులు కావాలో ప్రభుత్వం అంచనా వేసి సిద్ధం చేస్తున్నది. ఎక్కడా ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా వాటిని పంపిణీ చేస్తున్నది. 2014లో కేవలం 25 లక్షల టన్నుల ఎరువులు మాత్రమే పంపిణీ చేశారు. ఆ మాత్రానికే నానా ఇబ్బందులు ఉండేవి. ప్రస్తుతం 40 లక్షల టన్నులకు పెరిగింది. అయినా ఎక్కడా చిన్న ఇబ్బంది కూడా రావడం లేదు. ఇందుకు కారణం ధరణి. ఒక వేళ ధరణినే రద్దు చేస్తే.. రైతుల వివరాలు, పంటల వివరాలు ఉండవు. ఎన్ని ఎరువులు కావాలో తెలియదు. దీంతో మళ్లీ గందరగోళ పరిస్థితి ఏర్పడి, ఎరువులు, విత్తనాల కొరత వస్తుంది. మళ్లీ పోలీస్‌స్టేషన్లలో పెట్టి అమ్మే దుస్థితి దాపురిస్తుంది. మళ్లీ రైతుల వీపులపై పోలీసుల లాఠీలు విరిగే పరిస్థితి ఏర్పడుతుంది.



• ధరణితో ఈజీ రిజిస్ట్రేషన్

### ఎవుసం పడావు.. వలసలే గతి!

ఉమ్మడిరాష్ట్రంలో ఎకరాలకు ఎకరాల భూమి ఉన్న రైతులు సైతం 'అన్నమో రామ చంద్రా' అంటూ వలసలు వెళ్లే పరిస్థితి ఉండేది. లక్షల మంది ఇతర రాష్ట్రాలకు, దేశా లకు వలస వెళ్లారు. ఇప్పుడు ఆలాంటి భయం కర పరిస్థితి లేదు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో వ్యవసాయ విస్తీర్ణం భారీగా పెరిగింది. 2014లో రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం 1.30 కోట్ల ఎకరాలు ఉండగా ఇప్పుడు 2.3 కోట్ల ఎకరాలకు చేరింది. వరి సాగు విస్తీర్ణం 35 లక్షల ఎకరాల నుంచి 1.21 కోట్ల ఎకరాలకు పెరిగింది. కరువు జిల్లాలుగా పేరున్న మహబూబ్‌నగర్, మెదక్, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో సైతం వ్యవసాయ విస్తీర్ణం భారీగా పెరిగింది. తద్వారా వలసలు బంద్ అయ్యాయి. రైతు లంతా తిరిగి వచ్చి ఆత్మగౌరవంతో సొంత పొలాల్లో వ్యవసాయం చేసుకుంటూ సంతో షంగా బతుకుతున్నారు. ధరణి తీసేస్తే ఇవన్నీ తలకిందులవుతాయి. భూములకు లెక్కపత్రం ఉండదు. ఎవరి భూమి ఎవరి పేరుపై ఉన్నదో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. గ్రామాల్లో రైతుల మధ్య భూ తగాదాలు, గెట్ల పంచాయి తీలు పెరిగిపోతాయి. ఈ పంచాయితీలతో పోలీస్ స్టేషన్లు, కోర్టులచుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ గొడవలతో రైతులు పొలా లను వదిలేసి ఎవుసాన్ని పడావు పెట్టేసి మళ్లీ వలసలు వెళ్లే దుస్థితి ఏర్పడుతుంది.

## ధరణితోనే గాడిలోపడ్డ వ్యవసాయం

రాష్ట్రం ఏర్పడినప్పుడు అంతా గందర గోళం. వ్యవసాయం ఆగమాగం.. భూ రికా ర్డులు అస్తవ్యస్థం. రైతుల వివరాలు లేవు. ఏ భూమి ఏ రైతుదో తెలువదు. ఏ ప్రాంతంలో ఎంతమంది రైతులున్నరో, అక్కడ ఏం పంటలు పండుతాయో వివరా ల్లేవు. నిత్యం రైతుల మధ్య గెట్టు పంచాయి తీలు, భూ తగాదాలే. ఈ పంచాయితీల పుణ్యమా అని రైతులు ఎవుసాన్ని పడావు పెట్టి కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగే వారు. రైతుల సమస్యలన్నింటినీ దగ్గర నుంచి చూసిన సీఎం కేసీఆర్.. ఒక్క ధరణి అనే బ్రహ్మాస్త్రంతో ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపారు. ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి వ్యవసాయ, భూ సంస్కరణ లకు నాంది పలికారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా భూముల వివరాలను, రైతుల వివరాలను ఏకతాటిపైకి తీసుకొచ్చారు. ధరణిలోని వివరాల ఆధారంగానే వ్యవ సాయ సంస్కరణలను రూపొందించారు. వ్యవసాయ సంక్షేమ పథకాలను అమలుచే శారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్, పంటల కొనుగోళ్లు, ఎరువులు, విత్తనాల సరఫరా చేయాలంటేనే ఆగమాగమయ్యేవారు. ఇప్పుడు పంటల విస్తీర్ణం 2.3కోట్ల ఎకరా లకు పెరిగినా, ఎరువుల పంపిణీ 40 లక్షల టన్నులకు చేరినా, ధాన్యం ఉత్పత్తి 68 లక్షల టన్నుల నుంచి 2.50 కోట్ల టన్ను లకు ఎగబాకినా ఎక్కడా ఎలాంటి ఇబ్బంది రావడం లేదు. ధరణిలోని భూములు, రైతుల వివరాల ఆధారంగానే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రైతులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా పక్కాగా ప్రతి సంక్షేమ పథకాన్ని అందిస్తున్నారు. ఇదంతా ఒక్క ధరణితోనే సాధ్యమవుతు న్నది. ఈ విధంగా వ్యవసాయరంగాన్ని ఎంతగానో బలోపేతం చేసి రైతుల గోస తీర్చిన ధరణిని రద్దు చేస్తే పరిస్థితి మళ్లీ మొదటికే వస్తుంది. అందుకే రైతులు జాగ్ర త్తగా ఉండాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ధరణిని తీసేస్తామంటున్న కాంగ్రెస్ వస్తే మళ్లీ బతుకులు ఆగం కావడం ఖాయమని హెచ్చరిస్తున్నారు.